26-05-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - సదా మేము సంగమయుగ బ్రాహ్మణులమనే నషాలో ఉండండి. ఏ బాబాను (తండ్రిని) అందరూ పిలుస్తూ ఉన్నారో వారిప్పుడు మన సన్ముఖంలో ఉన్నారని మనకు తెలుసు "

ప్రశ్న:- ఏ పిల్లల బుద్ధియోగము సరిగ్గా ఉంటుందో వారికి ఎటువంటి సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి?

జవాబు :- సత్యయుగ నూతన రాజధానిలో ఏమేముంటాయో, అక్కడ పాఠశాలలో మనమెలా చదువుకొని, రాజ్యపాలన ఎలా చేస్తామో.... సమయం సమీపించు కొలది ఈ సాక్షాత్కారాలన్నీ జరుగుతూ ఉంటాయి. కానీ ఎవరి బుద్ధియోగము బాగుంటుందో, ఎవరు తమ శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేస్తారో, వృత్తి వ్యాపారాదులు చేస్తున్నా ఒక్క తండ్రి స్మృతిలోనే ఎవరుంటారో, వారికి ఈ సాక్షాత్కారాలన్నీ జరుగుతాయి.

పాట :- ఓం నమః శ్శివాయ....

ఓంశాంతి. భక్తిమార్గములో గల సత్సంగాలకు అందరూ వెళ్లే ఉంటారు. అక్కడ అందరూ 'వాహ్ గురూ!' అని గాని లేక రామ నామమును గాని పలికిస్తారు. కాని ఇక్కడ పిల్లలు ఏమీ పలుకవలసిన అవసరము లేదు. ఒక్కసారి చెప్పేశారు, పదే పదే చెప్పే అవసరము లేదు. తండ్రి కూడా ఒక్కరే. వారు చెప్పేది కూడా ఒక్కటే. వారేం చెప్తారు? "పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి (**మామేకమ్ యాద్ కరో**)." మొదట నేర్చుకున్న తర్వాత ఇక్కడకు వచ్చి కూర్చున్నారు, మనము ఏ తండ్రి పిల్లలమో ఆ తండ్రిని స్మృతి చేయాలి. మన ఆత్మలందరి తండ్రి ఒక్కరే అని కూడా మీరిప్పుడు బ్రహ్మా ద్వారా తెలుసుకున్నారు. ప్రపంచములోని వారికి ఇది తెలియదు. మనమంతా ఆ తండ్రి పిల్లలమే అని మీకు తెలుసు. వారిని అందరూ గాడ్‌ఫాదర్ అని అంటారు. "నేను ఇప్పుడు ఈ సాధారణ శరీరములో మిమ్ములను చదివించేందుకు వస్తాను" అని ఆ తండ్రి చెప్తున్నారు. బాబా వీరిలో వచ్చి ఉన్నారని మనము వారి పిల్లలుగా అయ్యామని మీకు తెలుసు. ఆ తండ్రే వచ్చి పతితుల నుండి పావనంగా అయ్యే దారిని తెలుపుతారు. ఇది పూర్తి రోజంతా బుద్ధిలో ఉంటుంది, నిజానికి అందరూ శివబాబా సంతానమే. కాని ఇది మీకు మాత్రమే తెలుసు. ఇతరులెవ్వరికీ తెలియదు. మనమంతా ఆత్మలమని, నన్నొక్కరినే స్మృతి చేయమని తండ్రి ఆజ్ఞాపించారని పిల్లలైన మీకు తెలుసు. నేను మీ అనంతమైన తండ్రిని, ఓ పతితపావనా! రండి, మేము పతితమయ్యామని అందరూ గట్టిగా అరుస్తూ, పిలుస్తూ ఉంటారు. ఈ మాటలనేది దేహము కాదు. ఆత్మ ఈ శరీరము ద్వారా అంటుంది. 84 జన్మలు తీసుకునేది కూడా ఆత్మనే కదా. మనమంతా పాత్రధారులమని బుద్ధిలో ఉండాలి. బాబా ఇప్పుడు మనలను త్రికాలదర్శులుగా చేశారు. ఆది-మధ్య-అంత్యముల జ్ఞానమునిచ్చారు. అందరూ తండ్రినే పిలుస్తారు కదా. ఇప్పుడు కూడా వారు రండి అని పిలుస్తూనే ఉన్నారు, పిలుస్తూనే ఉంటారు, కాని సంగమ యుగములోని బ్రాహ్మణులైన మీరు తండ్రి వచ్చేశారని అంటారు. ఈ సంగమ యుగము గురించి కూడా మీకు తెలుసు. దీనిని పురుషోత్తమ యుగమని అంటారు. కలియుగ అంతమునకు,

సత్యయుగ ఆరంభమునకు మధ్య ఈ పురుషోత్తమ యుగముంటుంది. సత్యయుగములో సత్యమైన పురుషులు(ఆత్మలు) కలియుగములో అసత్యమైన పురుషులు ఉంటారు. ఎవరైతే సత్యయుగములో ఉండి వెళ్లిపోయారో వారి చిత్రాలు ఉన్నాయి. ఈ చిత్రాలు అన్నిటికంటే పురాతనమైనవి. ఇంతకంటే పాత చిత్రములేవీ ఉండవు. చాలా మంది మనుష్యులు వ్యర్థ చిత్రములెన్నో తయారు చేస్తారు. ఎవరెవరు ఉండి వెళ్లిపోయారో మీకు తెలుసు. ఉదాహరణానికి క్రింద అంబ చిత్రము, కాళికా చిత్రాలున్నాయి. కానీ అన్ని భుజాలు కలిగిన వారెవ్వరూ ఉండరు. అంబకు కూడా రెండు భుజాలే ఉంటాయి కదా. మనుష్యులు వెళ్లి చేతులు జోడించి పూజలు చేస్తారు. భక్తిమార్గములో అనేక విధాలైన చిత్రాలు తయారు చేశారు. మనుష్యులకు రకరకాల అలంకారాలు చేస్తే రూపము మారిపోతుంది. వాస్తవానికి ఈ చిత్రాలు మొదలైనవేవీ లేవు. ఇవన్నీ భక్తిమార్గములోని చిత్రాలు. ఇక్కడ కుంటి, గ్రుడ్డి మనుష్యులుంటారు. సత్యయుగములో అటువంటి వారుండరు. సత్యయుగములో ఆది సనాతన దేవీదేవతా ధర్మముండేదని మీకు తెలుసు. ఇక్కడ డ్రస్సులు గమనించండి. అనేక రకాల డ్రస్సులున్నాయి. అక్కడ యథారాజా రాణి తథా ప్రజ అని అంటారు. ఎంత సమీపానికి వెళ్తారో అంత మీకు మీ రాజధానిలోని డ్రస్సు మొదలైనవి కూడా సాక్షాత్కారమవుతాయి. మేము ఇటువంటి పాఠశాలలో చదువుకుంటామని, ఈ పనులు చేస్తామని మీరు సాక్షాత్కారములో చూస్తూ ఉంటారు. ఎవరి బుద్ధియోగము బాగుంటుందో వారు చూస్తూ ఉంటారు. తమ శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేస్తారు. వృత్తి వ్యాపారాదులు చేసుకోవాల్సిందే. భక్తిమార్గములో కూడా వృత్తి వ్యాపారాదులు చేసుకుంటారు కదా. అప్పుడు కొద్దిగా కూడా జ్ఞానముండేది కాదు. అదంతా భక్తి. దానిని భక్తి మార్గములోని జ్ఞానమంటారు. విశ్వానికి అధికారులుగా అయ్యే జ్ఞానము వారు ఇవ్వలేరు. ఇప్పుడు మీరు కూడా చదువుకొని భవిష్యత్తులో విశ్వాధికారులుగా అవుతారు. ఈ చదువు నూతన ప్రపంచము లేక అమరలోకము కొరకు అని మీకు తెలుసు. అంతేకాని అమరనాథ్‌లో శంకరుడు పార్వతికి ఏ కథా వినిపించలేదు. వారు శివ-శంకరులను కలిపేశారు.

ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు అర్థము చేయిస్తున్నారు, ఇతను కూడా వింటాడు. తండ్రి తప్ప ఈ సృష్టి ఆది-మధ్య-అంత్యముల రహస్యమును ఎవరు అర్థం చేయించగలరు? వీరు ఏ సాధు-సత్పురుషుడు కాదు. మీరు ఎలాగైతే గృహస్థ వ్యవహారములో ఉన్నారో అలా ఇతను కూడా ఉండేవాడు. డ్రస్సు మొదలైనవన్నీ అప్పటివే. ఇంటిలో తల్లి-తండ్రి, పిల్లలు ఎలా ఉంటారో ఇది కూడా అలాగే తేడా ఏమీ లేదు. తండ్రి ఈ రథములో పిల్లల వద్దకు వచ్చారు. ఇది భాగ్యశాలి రథమని మహిమ చేయబడ్తుంది. అప్పుడప్పుడు నందిపై కూడా చూపిస్తారు. మనుష్యులు తప్పుగా అర్థము చేసుకున్నారు. మందిరంలో ఎద్దులనేమైనా ఉంచుతారా! కృష్ణుడేమో రాకుమారుడు, వారు ఎద్దు పైన కూర్చోరు. భక్తిమార్గములో మనుష్యులు చాలా తికమకగా ఉన్నారు. మనుష్యులకు భక్తిమార్గములోని నషా ఉంటుంది. మీకు జ్ఞానమార్గములోని నషా ఉంది. ఈ సంగమ యుగములో బాబా మమ్ములను చదివిస్తున్నారని మీరు చెప్తారు. మీరు ఈ ప్రపంచములోనే ఉన్నారు కాని బుద్ధి ద్వారా మేము బ్రాహ్మణులము సంగమయుగంలో ఉన్నామని భావిస్తారు. మిగిలిన మనుష్యులందరూ కలియుగములో ఉన్నారు. ఇవి అనుభవము చేసిన విషయాలు. మేము కలియుగము నుండి బయటకు వచ్చేశామని మీ బుద్ధి చెప్తుంది. బాబా వచ్చి ఉన్నారు ఈ పాత ప్రపంచమే పరివర్తన అవ్వనున్నది. ఈ విషయాలన్నీ మీ

బుద్ధిలో ఉన్నాయి, ఇతరులెవ్వరికీ తెలియదు. ఒకే ఇంటిలోనివారైనా, ఒకే పరివారములోనివారైనా అందులో తండ్రి నేను సంగమ యుగములో ఉన్నానని అంటే, కొడుకు నేను కలియుగములో ఉన్నానని అంటాడు. ఆశ్చర్యము కదా! మన చదువు పూర్తి అయితే వినాశనమవుతుందని పిల్లలకు తెలుసు. వినాశనమవ్వడం తప్పనిసరి. ఈ విషయాలు మీలో కూడా కొంతమందికి మాత్రమే తెలుసు. ప్రపంచము వినాశనమవుతుందని అర్థము చేసుకుంటే నూతన ప్రపంచము కొరకు ఏర్పాట్లు చేసుకోవడంలో లగ్నమైపోతారు. బ్యాగ్-బ్యాగేజ్ అంతా సర్దుకుంటారు. బాబావారిగా అయిపోవాలి. ఇక కొద్ది సమయము మాత్రమే ఉంది. ఆకలితో మరణించాల్సి వచ్చినా, మొదట బాబా, తర్వాత పిల్లలు. ఇది బాబా భండారము. మీరు శివబాబా భండారము నుండి తింటారు. బ్రాహ్మణులు భోజనము తయారు చేస్తారు, అందుకే బ్రహ్మభోజనమని అంటారు. ఎవరు పవిత్ర బ్రాహ్మణులుగా ఉంటారో, వారు స్మృతిలో ఉండి తయారుచేస్తారు. బ్రాహ్మణులు తప్ప శివబాబా స్మృతిలో ఎవ్వరూ ఉండలేరు. ఆ బ్రాహ్మణులు(ప్రపంచములోని లౌకిక బ్రాహ్మణులు) శివబాబా స్మృతిలో ఉండరు. ఇది శివబాబా భండారము. ఇక్కడ బ్రాహ్మణులు భోజనము తయారు చేస్తారు. బ్రాహ్మణులు యోగములో ఉంటారు. పవిత్రంగా ఉండనే ఉంటారు. మిగిలింది యోగ విషయము. ఇందులోనే శ్రమ కలుగుతుంది. ఇందులో అసత్యము, గొప్పలు పనికిరావు. నేను సంపూర్ణ యోగములో ఉన్నానని లేక 80 శాతము యోగములో ఉన్నానని ఎవరూ చెప్పలేరు. జ్ఞానము కూడా కావాలి. ఎవరైతే తమ దృష్టితోనే ఇతరులను శాంతపరుస్తారో వారే యోగులు. ఇది కూడా ఒక శక్తే. ఒక్కసారిగా నిశ్శబ్దమైపోతుంది, అప్పుడు మీరు అశరీరులుగా అవుతారు. తండ్రి స్మృతిలో ఉండడమే సత్యమైన స్మృతి. ఇది మళ్లీ అభ్యాసము చేయాలి. ఇక్కడ మీరు ఎలా స్మృతిలో కూర్చుంటారో అలా అభ్యాసము చేయించబడుతుంది. అయినా అందరూ యోగములో ఉండరు. బుద్ధి ఎక్కడెక్కడికో పరుగెత్తుతూ ఉంటుంది. అది నష్టపరుస్తుంది. నేను డ్రిల్లు టీచరును అని భావించేవారిని గద్దె పై కూర్చోబెట్టాలి. తండ్రి స్మృతిలో వారి ఎదురుగా కూర్చుంటారు. బుద్ధియోగము ఏ ఇతర వైపుకూ వెళ్లరాదు. నిశ్శబ్దమైపోతుంది. మీరు అశరీరులుగా అవుతారు. తండ్రి స్మృతిలో ఉంటారు. ఇది సత్యమైన స్మృతి. సన్యాసులు కూడా శాంతిగా కూర్చుంటారు. వారు ఎవరి స్మృతిలో ఉంటారు? వారిది సత్యమైన స్మృతి కాదు. ఎవ్వరికీ లాభము కలిగించలేరు. వారు సృష్టిని శాంతపరచలేరు. తండ్రిని గురించి వారికి తెలియనే తెలియదు. బ్రహ్మ తత్వమునే భగవంతునిగా భావిస్తారు. అది కానే కాదు. ఇప్పుడు నన్నొక్కరినే స్మృతి చేయమని శ్రీమతము లభిస్తుంది. మనము 84 జన్మలు తీసుకుంటామని మీకు తెలుసు. ప్రతి జన్మలో కళలు కొద్ది కొద్దిగా చంద్రునిలో కళలు తగ్గినట్లు తగ్గిపోతూ ఉంటాయి. చూసేందుకు తగ్గినట్లు కనిపించదు. ఇప్పుడింకా ఎవ్వరూ సంపూర్ణంగా అవ్వలేదు. పోను పోను మీకు సాక్షాత్కారాలవుతాయి. ఆత్మ చాలా చిన్నది. అది కూడా సాక్షాత్కారమవుతుంది. లేకుంటే వీరిలో లైటు ఎక్కువగా ఉందని, వీరిలో తక్కువగా ఉందని పిల్లలెలా చెప్పగలరు. ఆత్మను దివ్యదృష్టితో మాత్రమే చూడగలరు. ఇది కూడా డ్రామాలో నిర్ణయించబడింది. నా చేతిలో ఏమీ లేదు. డ్రామా నాతో చేయిస్తుంది. ఇదంతా డ్రామానుసారము జరుగుతూ ఉంటుంది. భోగ్ మొదలైనవన్నీ డ్రామాలో నిర్ణయించబడినవి. సెకండు సెకండు పాత్రాభినయము జరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు తండ్రి పావనంగా ఎలా అవ్వాలో శిక్షణనిస్తున్నారు. తండ్రిని స్మృతి చేయాలి.

పతితమైపోయిన ఎంతో చిన్న ఆత్మ ఇప్పుడు మళ్ళీ పావనంగా అవ్వాలి. ఇది అద్భుతమైన విషయము కదా. ప్రాకృతికము(కుదరత్) అని అంటారు కదా. తండ్రి నుండి మీరు అన్నీ ప్రాకృతిక విషయాలనే వింటారు. అన్నిటికంటే ఎక్కువ ప్రాకృతిక విషయము - ఆత్మ-పరమాత్మల విషయము, ఇది ఎవ్వరికీ తెలియదు. ఋషులు, మునులు మొదలైన వారెవ్వరికీ తెలియదు. ఇంత చిన్న ఆత్మనే రాతిబుద్ధిగా అయి మళ్ళీ బంగారు(పారస) బుద్ధి గలదిగా అవుతుంది. రాతిబుద్ధిగా మారిపోయిన నేను ఇప్పుడు తండ్రిని స్మృతి చేసి మళ్ళీ పారసబుద్ధిగా అవుతున్నానని సదా బుద్ధిలో తిరుగుతూ ఉండాలి. లౌకికంలో కూడా తండ్రి, టీచరు, గురువు కూడా పెద్దవారే లభిస్తారు. కాని ఇక్కడ తండ్రి, టీచరు, గురువు అన్నీ ఒక్క బిందువైన తండ్రియే. కల్పమంతా దేహధారులను స్మృతి చేశారు. ఇప్పుడు నన్నొక్కరినే స్మృతి చేయమని తండ్రి చెప్తున్నారు. మీ బుద్ధిని ఎంతో సూక్ష్మంగా తయారు చేస్తున్నారు. విశ్వానికి అధిపతులుగా అవ్వడం చిన్న మాటనా! ఈ లక్ష్మీనారాయణులు సత్యయుగానికి అధిపతులుగా ఎలా అయ్యారని ఎవ్వరూ ఆలోచించరు. మీకు కూడా నంబరువారు పురుషార్థానుసారమే తెలుసు. కొత్తవారెవ్వరూ ఈ విషయాలు అర్థము చేసుకోలేరు. మొదట స్థూలంగా తెలిపించిన తర్వాత సూక్ష్మముగా తెలిపించబడుతుంది. తండ్రి బిందువు కాని వారు పెద్ద పెద్ద శివలింగ రూపాన్ని తయారు చేస్తారు. మనుష్యుల చిత్రాలు కూడా పెద్ద పెద్దవి తయారుచేస్తారు. కాని అలా ఎవ్వరూ లేరు. మనుష్యుల శరీరాలైతే ఇక్కడే ఉంటాయి. భక్తిమార్గములో ఏమేమో తయారు చేశారు. మనుష్యులు చాలా తికమక పడి ఉన్నారు. జరిగిపోయిన విషయాలు మళ్ళీ జరుగుతాయని తండ్రి చెప్తున్నారు. ఇప్పుడు మీరు తండ్రి శ్రీమతమునననుసరించండి. ఇతనికి కూడా బాబా శ్రీమతమునిచ్చారు. నీకు నేను చక్రవర్తి పదవినిస్తాను, ఇప్పుడు ఈ సేవలో లగ్నమై వారసత్వము తీసుకునే పురుషార్థము చేయి, ఇవన్నీ వదిలేయమని సాక్షాత్కారము చేయించారు కదా. ఇలా శివబాబా చెప్పినందునే ఈ బ్రహ్మ నిమిత్తమయ్యాడు. అందరూ అలా నిమిత్తమవ్వరు. ఎవరికి నషా ఎక్కిందో వారు వచ్చి ఇక్కడే ఉండిపోయారు. మనకు రాజ్యపదవి లభిస్తుంది. అటువంటప్పుడు ఈ పనికిరాని అత్యంత తక్కువ విలువగల ఈ ధనాన్ని ఏం చేసుకుంటాము! అని భావించారు. ఇప్పుడు తండ్రి పిల్లలతో పురుషార్థము చేయిస్తున్నారు. రాజధాని స్థాపన అవుతూ ఉంది. మేము లక్ష్మీనారాయణులకు తక్కువగా అవ్వము అని కూడా అంటారు. అయితే శ్రీమతమును అనుసరించి చూపించండి. కేవలం మాటలు చెప్పకండి. నా పిల్లల గతి ఏమవుతుంది? అనేమైనా ఈ బాబా అన్నారా? ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే, వారి పిల్లలు ఆకలితో ఉంటారా? బంధు-మిత్రులెవరో తినేందుకు ఇస్తారు, సహాయము చేస్తారు. బాబా ఎంత పాత కొట్టములో(కుటీరము) ఉన్నారో చూడండి. అయితే పిల్లలైన మీరు వచ్చి ఇక్కడ భవనాలలో ఉన్నారు. పిల్లలూ! బాగా తినండి, తాగండి, ఉండండి అని తండ్రి అభిలాష. ఏమీ తీసుకు రానివారికి కూడా అన్నీ చక్కగా లభిస్తాయి. ఈ బాబా కంటే మంచి సౌకర్యాలతో ఉంటున్నారు. శివబాబా చెప్తున్నారు - నేను దేశాలు తిరిగే యోగిని(రమతా యోగిని) ఎవరికైనా కళ్యాణము చేసేందుకు వెళ్ళగలను. జ్ఞానవంతులైన పిల్లలు ఎప్పుడూ సాక్షాత్కారాలు మొదలైనవాటి ద్వారా సంతోషించరు. యోగము తప్ప వేరే ఏదీ లేదు. ఈ సాక్షాత్కారాలు జరిగాయని సంతోషించరాదు. అచ్ఛా

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. దృష్టితోనే ఎవరినైనా శాంతపరచగల యోగస్థితిని తయారు చేసుకోవాలి. సంపూర్ణ నిశ్శబ్ధము ఏర్పడాలి. దీని కొరకు అశరీరులుగా అయ్యే అభ్యాసము చేయాలి.
2. సత్యమైన జ్ఞాన నషాలో ఉండేందుకు మేము సంగమ యుగములో ఉన్నాము, ఇప్పుడు ఈ పాత ప్రపంచము పరివర్తన అవుతుంది. మేము మా ఇంటికి వెళ్తున్నామను స్మృతి ఉండాలి. సదా శ్రీమతమును అనుసరిస్తూ ఉండాలి, కేవలం మాటలు మాట్లాడకండి.

వరదానము :- " లక్ష్యమనుసారము లక్షణాలను బ్యాలన్స్ చేసే కళ ద్వారా ఎక్కేకళను అనుభవం చేసే తండ్రి సమానం సంపన్న భవ "

పిల్లలలో విశ్వ కళ్యాణం చేసే కోరిక కూడా ఉంది, తండ్రి సమానంగా అవ్వాలనే శ్రేష్ఠమైన ఇష్టము కూడా ఉంది. కాని లక్ష్యమనుసారము ఏ లక్షణాలైతే స్వయానికి లేక సర్వులకు కనిపించాలో అందులో వ్యత్యాసముంది. అందువలన బ్యాలన్స్ చేసే కళను ఇప్పుడు ఎక్కేకళలోకి తెచ్చి ఆ వ్యత్యాసాన్ని తొలగించండి. సంకల్పముంది కాని దృఢతా సంపన్నమైన సంకల్పముంటే తండ్రి సమానంగా అయ్యే వరదానము ప్రాప్తి అవుతుంది. ఇప్పుడు స్వదర్శన, పరదర్శన చక్రాలు రెండూ తిరుగుతున్నాయి. వ్యర్థ విషయాలలో త్రికాలదర్శులుగా అవుతున్నారు. దీనిని పరివర్తన చేసుకొని స్వచింతన, స్వదర్శన చక్రధారులుగా అవ్వండి.

స్లోగన్ :- " సేవా భాగ్యము ప్రాప్తించడమే అన్నిటికంటే గొప్ప భాగ్యము. "